సొకు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, నాయకులు

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

డోర్నకల్, మే 14 : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం లచ్యాతండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చేయాలన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందాయన్నారు. కాంగ్రెస్ పాలన వచ్చి ఐదు నెలలు పూర్తయినా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల కిచ్చిన ఏ ఒక్క గ్యారెంటీ అమలు చేయలేదన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. లచ్యాతండాకు చెందిన ఆర్డీవో శంకర్‌నాయక్ తల్లి బదావత్ సొకు (70) ఇటీవల మృతి చెందగా, విషయం తెలుసుకున్న సత్యవతి రాథోడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జడ్పీ చైర్మన్ అంగోత్ బిందు, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కళ్లెపు సతీశ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు బానోత్ పాండూనాయక్, బాదావత్ బాలాజీ, నాయకులు మాన్యపాట్టి, మోహన్, రఘు, శంకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాం నాయక్

ఎన్నికల్లో మోదీకి ఎదురుదెబ్బ

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

మహబూబాబాద్ రూరల్, మే 14 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీకి ఎదురుదెబ్బ తప్పదని కాంగ్రెస్ మానుకోట పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యేలు డాక్టర్ మురళీనాయక్, రామచంద్రు నాయక్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో పేదలకు తప్పనిసరిగా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం మొదటి దశలో అత్యంత నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసిన కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భరత్ చంద్రారెడ్డి, గణపురపు అంజయ్య, చుక్కల ఉదయ్ చందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా మండల పూజ

గూడూరు, మే 14 : మండలంలోని మధనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీగోదాలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మండల పూజ వైభవంగా జరిగింది. గ్రామంలో అన్ని హంగులతో ఆలయం నిర్మించి 41 రోజులవుతున్న సందర్భంగా ఆలయ శాశ్వత చైర్మన్ లింగాల రాధికా సుధీర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు, యాగం, హోమాలు నిర్వహించారు.

హోమంలో పాల్గొన్న సుధీర్‌రెడ్డి దంపతులు

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మరిపెడ బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యానన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **ఇస్లావత్ వింకన్న**, S/o : **లచ్చా**, **వయస్సు** :27సం॥లు, వృత్తి : వ్యవసాయం, **నివాసం** : ఇ.నెం. ఇస్లావత్ తండ గ్రామం, తిరుమలాయపాలెం మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైనహా ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి: గ్రామపంచాయితీ మరిపెడ మండలం, మండల పరిషత్తు మరిపెడ, జిల్లాపరిషత్తు మరియు జిల్లా రిజిస్ట్రారు వరంగల్ సబ్ రిజిస్ట్రారు మహబూబాబాద్ వారి పరిధిలోని మరిపెడ గ్రామంలోని ఖుమ్మి సర్వే నెం. 498 మరియు 499 మింజమలే భాశీ స్థల విస్తీర్ణము : 166.66 చ॥గ॥ సమము 139.34 చ॥మీ॥, **డాక్యుమెంట్ నెం. 6921/2011** ఇందులో ఏలాంటి కట్టడములు నిర్మాణములు లేవు. ఏ వార్డు బ్లాక్‌కు బంధించినది కానటువంటి స్థిరాస్తికి హద్దులు : **తూర్పు** : అమ్మిన వారి స్థలం, **పడమర**: 20 ఫీట్ల ప్రపోజ్డ్ రోడ్,**ఉత్తరం** : అమ్మినవారి స్థలం, **దక్షిణము** : మార్తా దయాకర్ గారి స్థలం.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

- వడ్లు పోసిన స్థలానికి క్వింటాలు రూ.2, లారీ డ్రైవర్‌కు రూపాయి, బస్తాల సుత్నికి రూపాయి..
- అదనపు వసూళ్లు, తరుగు పేరుతో దోపిడీ
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ప్రైవేట్ వ్యాపారుల కాంటాలు
- పట్టించుకోని అధికారులు

కొరిపెల్లిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రంలో ప్రైవేట్ వ్యాపారస్థులకు కాంటాలు చేస్తున్న హమాలీలు, కాంటాలు చేసిన బస్తాలు

అంతా దోపిడీ..!

పెద్దవంగర మండలం కొరిపెల్లి కొనుగోలు కేంద్రంలో నిర్వాహకుల ఇష్టారాజ్యం

పెద్దవంగర, మే 14 : ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యానికి రైతులు దళారులకు అమ్ముకొని నష్టపోవద్దనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు ధాన్యం నాణ్యతాప్రమాణాలను పరీక్షించి, కాంటాలు పెట్టి, మిల్లులకు తరలించి రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేయాలి. కానీ, పెద్దవంగర మండలంలోని కొరిపెల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తరుగు, అదనపు వసూళ్లతో రైతులను దోచుకుంటున్నారు. ధాన్యంలో తేమ శాతాన్ని పరీక్షించి, సరిగా ఉంటేనే 41కిలోల చొప్పున కాంటాలు పెట్టాలి. కానీ, కొరిపెల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో బస్తా 41.350కిలోలు, లేదా 41.300కిలోలతో కాంటాలు వేస్తూ తరుగుపేరుతో కోత విధిస్తున్నారు. అంతేకాకుండా ఎక్కడా లేనివిధంగా ధాన్యం పోసిన స్థలానికి క్వింటాలు రూ.2, లారీ డ్రైవర్‌కు రూపాయి, బస్తాలకు కుట్టువేసి సుత్నికి రూపాయి చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. హమాలీతోపాటు రైతుల నుంచి అక్రమంగా వసూలు చేసేవాటితో కలిపి సగటున క్వింటాలుకు రూ.52 చొప్పున అదనంగా ఖర్చువుతున్నదని చెబుతున్నారు. అంతేకాకుండా ఇక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ప్రైవేట్ వ్యాపారులు కాంటాలు పెడుతున్నా వారిపై అధికారులు, నిర్వాహకులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

తప్పు జరిగితే చర్యలు తీసుకుంటాం..

కొనుగోలు కేంద్రంలో అక్రమ వసూళ్లు చేయొద్దు. బస్తా 41కిలోల చొప్పున కాంటా పెట్టాలి. మహిళా సంఘాల నిర్వాహకులు తప్పు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని, రైతులకు న్యాయం చేస్తాం. ఇప్పటికీ కొరిపెల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో 111 మంది రైతుల ధాన్యం 5,908 క్వింటాళ్లు మిల్లులకు పంపాం. కాంటాల్లో హామీల బాధ్యత రైతులదే. భూమి కోసం, లారీ డ్రైవర్లకు, బస్తా కుట్టు సుత్నికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడినం.. ధాన్యం బస్తాల్లో తరుగు పేరుతో కోత జరిగుంటే విచారణ చేపట్టి, ఇచ్చే కమిషన్‌లో కోత విధిస్తాం.

–డీపీఎం నళినీనారాయణ, ఏపీఎం రమణాచారి

మొదటి సారి లోడుకు కోత.. రెండోసారి లేదు..

నా పేరు సాకి నర్సయ్య. ఐకేపీ సెంటర్‌లో పోసి వడ్లు పట్టినం. వాటిని రెండు కుప్పలుగా చేసినం. మహిళా సంఘపోళ్లు వచ్చి చూసి కాంటా పెట్టిచ్చిండ్రు. బస్తా 41.300కిలోల చొప్పున కాంటా పెట్టిండ్రు. మొదటిసారి కొన్ని బస్తాలు లోడుకు పంపిండ్లు. వాటిలో ఏడు బస్తాలను తరుగు కింద కోత పెట్టిండ్లు. తర్వాత కొన్ని వడ్ల బస్తాలు పంపిండ్లు.. వాటిలో కోత పెట్టలేదు. అదే లారీలో మొత్తం నలుగురు రైతుల లోడుగా పోతే..దాంట్లో ముగ్గురికి మాత్రమే బస్తాలను తరుగు కింద తీసి, ఇంకో రైతుది తీయలేదు. ఎందుకంటే.. అట్లానే ఉంటదని అంటున్నారు. వడ్లు పోసినందుకు భూమి వాళ్లకు క్వింటాలుకు రూ.2, లారీ డ్రైవర్‌కు రూపాయి, బస్తా కుట్టే సుత్నికి రూపాయి మా దగ్గరే అడిగి ఇచ్చిండ్రు. ఎందుకు అంటే అందరూ ఇస్తలేర.. అంటూ ఇష్టమెచ్చినట్లు మాట్లాడుతున్నరు.

–సాకి నర్సయ్య, రైతు కొరిపెల్లి గ్రామం

ధాన్యం కొనుగోళ్లలో అంతా దోపుకం..

నా పేరు గుగులోత్ రాధ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అంత దోపుకం జరుగుతుంది. గతంలో ఇట్లా జరుగలే. వడ్ల పైసలు పడ్డాయా అని వాళ్లను అడిగితే నీ వడ్లు తూకంలో తక్కువ వచ్చిందని చెప్పిళ్లు. కాంటాలు అయి మిల్లుకు పోయిన కొద్ది రోజులకు ఇట్లా చెప్పి మమ్మల్ని మోసం చేసిండ్రు. ఇక్కడ కాంటా పెట్టితే క్వింటాలు రూ.52 దాకా ఖర్చు వస్తాంది. ఏప్రిల్ 29న మొత్తం నలుగురు రైతుల చెందిన 521బస్తాల లారీ లోడ్‌గా మిల్లుకు వెళ్లింది. ఇప్పుడు 506 బస్తాలే అంటుళ్లు. 19 బస్తాలు ఎటు పోయినయ్. మా లెక్క ఎంత మంది రైతులకు అలా జరిగిందో.. వాళ్లపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలి.

–గుగులోత్ రాధ, శంకర్ తండా, కొరిపెల్లి రెవెన్యూ గ్రామం

ధాన్యం బస్తాల కోతతో నష్టపోయిన రైతులు

కాంటా వేసేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యపు బస్తాలు

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

- సీసీ కెమెరాలు, పోలీసులతో నిఘా
- 24/7 డిప్యూటీ తహసీల్దార్ల పర్యవేక్షణ

మహబూబాబాద్, మే 14 : మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు సెగ్మెంట్లలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అధికారులు కేంద్ర బలగాలతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో జరిగిన ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను మంగళవారం తెల్లవారు జామున 5 గంటల వరకు జిల్లా కేంద్రంలోని స్థానిక సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, జూనియర్ కాలేజీలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, ములుగు, నర్సంపేట అసెంబ్లీ స్థానాల ఈవీఎంలు రాత్రి పొద్దుపోయే సమయానికి చేరాయి. వీటన్నింటినీ స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచే సరికి తెల్లవారుజామున 5 గంటలు అయినట్లు అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ వెల్లడించారు. జూన్ నాలుగో తేదీ కౌంటింగ్ ప్రక్రియ వరకు ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రత ఉంటుందన్నారు. పార్లమెంట్‌లో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం 70.68 శాతం ఓట్లు పోలైనట్లు తెలిపారు. సీసీ కెమెరాలు, పోలీసులతో గట్టి భద్రతా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈవీఎంల వద్ద జిల్లాలోని పలువురు డిప్యూటీ తహసీల్దార్లు షిఫ్టుల వారీగా విధులు చేపడతారన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ప్రత్యేక దృష్టి సారించామని, ఈవీఎంల భద్రతను నిత్యం పర్యవేక్షిస్తున్నట్లు అదనపు కలెక్టర్ డేవిడ్ తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

మహబూబాబాద్ రూరల్,మే 14: వడదెబ్బతో వృద్ధుడు మృతిచెందిన ఘటన మండల శివారులో మంగళవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని బట్టుతండాకు చెందిన బానోత్ బీక్యా (70) పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఎండలో వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. కొద్దిసేపటి తర్వాత కండ్లు తిరుగుతున్నాయని చెప్పడంతో కుటుంబ సభ్యులు దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. బీక్యాకు ఇద్దరు కుమారులుండగా సంవత్సర క్రితం మృతి చెందారు. భార్య ద్వాలి ఉన్నారు.

మద్దివంచలో అధ్వానంగా పారిశుధ్యం

గార్ల, మే 14: మండలంలోని మద్దివంచ గ్రామంలో 4 నెలలుగా పారిశుధ్య పనులను జీపీ సిబ్బంది గాలికొదిలేశారు. 4వ వార్డు డ్రైనేజీలో చెత్తచెదారం పేరుకుపోయి మురుగు నీళ్లు నిల్వ ఉండి, దుర్వాసన వెదజల్లుతున్నది. జీపీ సిబ్బందికి విషయం చెప్పినా పట్టించుకోకపోవడంతో మంగళవారం స్వయంగా వార్డు ప్రజలు డ్రైనేజీ కాల్వను శుభ్రం చేయించారు.

మద్దివంచలోని డ్రైనేజీలో చెత్తను తొలగిస్తున్న 4వ వార్డు వాసి

ఉపాధ్యాయులపై లాఠీచార్జిని ఖండించాలి

మహబూబాబాద్ రూరల్, మే 14 : నారాయణఖేడ్‌లో నిబంధనల ప్రకారం ఎన్నికల టీఏ, డీఏ అడిగిన ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జి చేయించడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి యాకూబ్ ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు డీఏలు చెల్లించకపోగా, నారాయణ్‌ఖేడ్ ఆర్డీవో పోలీసులతో లాఠీచార్జి చేయించడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో పీవో, ఏపీవోలకు రూ.3,150, ఓపీవో, సిబ్బందికి రూ.1,750 చెల్లించాల్సి ఉండగా పీవో, ఏపీవోలకు రూ.2,550, ఓపీవోలు, సిబ్బందికి మాత్రం రూ.1,350 చెల్లించారని అన్నారు. సక్రమంగా చెల్లింపులు చేయాలని అడిగిన వారిపై లాఠీచార్జి చేయించారని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.

ధరావత్ తండాలో డెంగీ బాధితులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డీఎంహెచ్‌వో కళావతిబాయి

డోర్నకల్, మే 14 : ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో కళావతి బాయి సూచించారు. చాప్లతండా గ్రామపంచాయతీ పరిధి ధరావత్‌తండాలో ఇటీవల ఐదు డెంగీ పాజిటివ్ కేసులు రావడంతో మంగళవారం ఆమె తండాలో రోగులను పరామర్శించారు. పాజిటివ్ వచ్చిన ఇళ్లు, దగ్గరలోని 62 ఇళ్లకు మందు పిచికారీ చేయించారు. ముఖ్యంగా మధ్యాహ్నం దోమలు కుట్టడం వల్ల డెంగీ వస్తుందన్నారు. వారానికి రెండుసార్లు మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇండ్ల పరిసరాల్లో నీళ్లు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని జీపీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావు, డాక్టర్ శ్రావణ్, ఇన్‌చార్జి డీపీహెచ్‌ఎన్‌వో మంగమ్మ, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష
- అయోధ్యపురం పీహెచ్‌సీ సందర్శన

గూడూరు, మే 14 : ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష అన్నారు. మంగళవారం మండలంలోని అయోధ్యపురం పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రతి కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా అమలు చేయాలని, ప్రతి మంగళవారం ఆరోగ్యంపై మహిళల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను వారికి తెలియజేయాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యమున, మెడికల్ అధికారి జీ దేవేందర్, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ పుష్పలత, సీహెచ్ కృష్ణార్జున, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబలీష

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

RECRUITMENT

jobs Apply Now!

★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

CHANGE OF NAME

★I, RAHIM BHAI MISTRY, R/o. H.No. 8-8-68, Khoja Mohalla, GR Gutta, Warangal, Telangana, Pin-506 002, have Changed My Name as **"RAHIM MISTRY"** for future purpose.
NT-327628

CHANGE OF NAME

I, **M.MANASA, D/o. SUDHKAR, W/o. VALABOJU JAGAN,** R/o. 18-1-28, Chaitanya nagar, near Ursu, Rangashaipet, Warangal- 506005, Have changed my name to **M.MANASA, D/o. SUDHAKAR, W/o. VALABOJU JAGAN,** for all future purposes.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

అమ్మే ఆది గురువు

- 'వెట' వ్యవస్థాపకురాలు ఝాన్సీరెడ్డి
- ఎమ్మెల్యే యశస్వినీరెడ్డితో కలిసి మాతృమూర్తులకు సన్మానం

'వెట' ఆధ్వర్యంలో మహిళలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఝాన్సీరెడ్డి

తొర్రూరు, మే 14: సృష్టిలోని ప్రతి జీవికి, ఆదిమూర్తికి కూడా అమ్మే ఆది గురువుగా నిలిచిందని ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్ (వెట) వ్యవస్థాపక అధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డితో కలిసి మంగళవారం నాంచారిమడూరు శివారులోని రెడ్డి గార్డెన్‌లో వెట ఆధ్వర్యంలో నిర్వహించిన మాతృదినోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గంలోని సుమారు 600 మంది మాతృమూర్తులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు సుంచు సంతోష్, సోమ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సగర సంఘం జిల్లా నాయకుడు సమ్మయ్య

భగీరథ మహర్షి మహనీయుడు

పెద్దవంగరలో భగీరథ మహర్షి జయంతి కార్యక్రమంలో సగర సంఘ నాయకులు

పెద్దవంగర, మే14: భగీరథ మహర్షి మహనీయుడని జిల్లా సగర సంఘం నాయకులు దుంపల సమ్మయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పరగూడెం, పెద్దవంగర గ్రామాల్లో భగీరథ మహర్షి జయంతి కార్యక్రమంలో భాగంగా మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వేణుసాగర్, అనుదీప్, సాంబయ్య, రఘు, జమున, శోభ, లక్ష్మి, భిక్షం, వెంకటేశం, సతీశ్, యాలాద్రి, అశోక్, రాజేశ్, రాము పాల్గొన్నారు.

బైక్‌ను కారు ఢీకొని యువకుడి మృతి

జనగామ చౌరస్తా, మే 14 : జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. జనగామ అర్బన్ సీఐ రఘుపతిరెడ్డి కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన మునుకుంట్ల రవి(37) సోమవారం రాత్రి బైకుపై ఇంటికి వెళ్తున్న క్రమంలో కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రవిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యంలో మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ దండెం ప్రతాప్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడు స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియాలో కొత్తగా ఇల్లు నిర్మించుకుని భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నారు. మృతుడు రన్ ఇండియా ఫౌండేషన్ సభ్యుడిగా కొనసాగుతున్నట్లు సమాచారం.

సరళ (ఫైల్)

చికిత్స పొందుతూ మహిళ మృతి

బచ్చన్నపేట, మే 14 : మండల కేంద్రానికి చెందిన కుందారపు సరళ (47) గుండెపోటుతో దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సరళకు సోమవారం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు బాధితురాలిని చికిత్స నిమిత్తం హనుమకొండలోని దవాఖానకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతదేహాన్ని ఎంపీటీసీ సభ్యులు నల్లగోని పుష్పబాలకిషన్‌గౌడ్, ఆల్వాల రాధ ఎల్లయ్య, మాజీ సర్పంచ్ వడ్డేపల్లి మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొండి వెంకట్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వారి వెంట మాజీ వార్డు సభ్యులు బుచ్చిరాజు, రమేశ్, నర్సింగరావు, బీఆర్ఎస్ నాయకులు నరేందర్ , షబ్బీర్, ఉపేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.